క్లుప్తంగా

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి



బిర్లాగేట్ స్మార్ట్ స్ట్రీట్ పనుల గురించి ఈఈలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. మంగళవారం నగరంలో జరుగుతున్న పార్కుల, స్పోర్ట్సు కాంప్లెక్స్, స్మార్ట్ రోడ్లు, వెండర్ జోన్ నిర్మాణాలను కమిషనర్ పరిశీలించారు. ప్రగతి వివరాలను స్థానికంగా ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతతో పాటు త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఈఈలు శేషసాయి, షాకీర్ హుస్సేన్,డీఈఈలురాజశేఖర్, నరేష్ ఉన్నారు.

గిరిజన భవన్ పరిశీలన



గిరిజన భవన్‌ను పరిశీలిస్తున్న డీటీడబ్ల్యూఓ శ్రీనివాసకుమార్

కర్నూలు(అర్బన్): నగర శివారులో రూ.1.35 కోట్ల వ్యయంతో నిర్మించిన గిరిజన భవన్‌ను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్ శ్రీనివాసకుమార్ మంగళవారం పరిశీలించారు. దాదాపు రెండేళ్ల క్రితమే నిర్మాణం పూర్తయినా.. ఇప్పటి వరకు నిరుపయోగంగా ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన భవనాన్ని పరిశీలించారు.

రేపు 'మహర్షుల చరిత్ర ఆధ్యాత్మిక ప్రవచనం'



మాట్లాడుతున్న గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో రెండు రోజుల పాటు మహర్షుల చరిత్రపై ఆధ్యాత్మిక ప్రవచనం ఏర్పాటు చేసినట్లు గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త తెలిపారు. గోదాగోకులంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 3న సాయత్రం 6 గంటలకు, 4వ తేదీ ఉదయం 10.30 గంటలకు ప్రవచనం ఉంటుందన్నారు. ప్రణవ పీఠాధిపతి, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, అభినవ శుక త్రిభాషా మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ స్వామి మహర్షుల చరిత్రపై ధార్మిక ప్రవచనం చేస్తారన్నారు.


పోరుయాత్ర జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు పి.నిర్మల

కర్నూలు (న్యూసిటీ): ఈ నెల 9వ విజయవాడలో నిర్వహించనున్న మహిళల పోరుయాత్రను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు పి.నిర్మల కోరారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో మహిళ పోరుయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సంఘం కార్యదర్శి ఎస్.అలివేలుతో కలిసి ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. హింస, అశ్లీలతను ప్రేరేపించే చిత్రాలు, టీవీ సీరియల్స్, ఇంటర్ నెట్ కార్యక్రమాలను నిషేధించాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా కోశాధికారి పీఎస్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): వెల్దుర్తి మండలంలోని రామళ్లకోట, సర్పరాజపురం, కలుగొట్ల, బోయినపల్లె, నరసాపురం, పుల్లగుమ్మి తదితర గ్రామాల్లో పచ్చి మిరపను సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి కోరారు. మంగళవారం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణతో కలిసి ఆయన డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు.

ప్లేట్ ఫిరాయించొద్దు

- నంబర్ ప్లేట్ తొలగించే వాహనదారులపై కేసులు
- నేరాల అడ్డుకట్టకు పోలీసుల ముమ్మర తనిఖీలు
- ఆరు మాసాల్లో 933 వాహనాలు స్వాధీనం



పోలీసుల తనిఖీలో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలు

కర్నూలు: ట్రాఫిక్ జరిమానాల నుంచి తప్పించుకునేందుకు వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లకు నంబర్ ప్లేటు తొలగించి యథేచ్ఛగా తిరుగుతున్నారు. పట్టుబడమనే ధీమాతో రహదారులపై చక్కర్లు కొడుతున్నారు. ఇటువంటి వారిపై కఠినంగా వ్యవహరించేందుకు పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. నంబర్ ప్లేటు లేకపోయినా, అంకెలు చెరిపేసినా చీటింగ్ కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తున్నారు.

అధిక శాతం యువకులే..

యువకులు, విద్యార్థులు, వ్యాపారులు, చిరుద్యోగులు అధిక శాతం ద్విచక్ర వాహనాలను ఉపయోగిస్తున్నారు. పోలీసుల తనిఖీలు, జరిమానాలకు భయపడి తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్లు తొలగిస్తున్నారు. కొందరు నాలుగు అంకెల్లో ఒక దానిని తీసేయడం, కనిపించకుండా చేయడం వంటివి చేస్తున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో నంబర్ ప్లేట్లు లేకపోయినా, సక్రమంగా అమర్చుకోకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేస్తున్నారు. చలానాల నుంచి బయట పడేందుకు చేసే తప్పిదంతో కేసుల్లో ఇరుక్కోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు

☛ కర్నూలు బుధవారపేటలో నివాసముంటున్న ఓ పోలీసు అధికారి భార్య ఇంటి ముందు ముగ్గేస్తుండగా నంబర్ ప్లేట్ లేని వాహనంపై ఇద్దరు యువకులు ఆమెను సమీపించి మెడలో ఉన్న 4 తులాల బంగారు గొలుసును లాక్కుని ఉడాయించారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా వాహనానికి నంబర్ ప్లేటు లేకపోవడంతో దొంగలను గుర్తించడానికి పోలీసులకు కష్టతరంగా మారింది.

☛ కొద్దిరోజుల క్రితం కర్నూలు శివారులోని డోన్ జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. వాహనం నంబర్ సరిగా లేకపోవడంతో క్షతగాత్రుడి ఆచూకీ గుర్తించేందుకు చాలా సమయం పట్టినట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు.

☛ ప్రభుత్వాసుపత్రిలో పోలీసులను గమనించి ద్విచక్ర వాహనం అక్కడే నిలిపేసి ఓ యువకుడు పారిపోయాడు. జిల్లాపరిషత్ ఎదురుగా ఉన్న వ్యాపార సముదాయం ముందు చోరీ చేసిన ఆ వాహనాన్ని నంబర్ ప్లేట్ తొలగించి వాడుతున్నట్లు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు.

☛ గతంలోనూ చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితులు ముందుగా ఏదో ఒక చోట వాహనాలు చోరీ చేసి నంబర్ ప్లేట్ తొలగించి వరుస చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు అప్రమత్తమై ప్రధాన కూడళ్ల వద్ద గస్తీ పెంచి తనిఖీ నిర్వహిస్తున్నారు.

పోలీసులకు పట్టుబడితే ఇక్కట్లే..

ఓ యువకుడు తన ద్విచక్ర వాహనానికి నంబర్ ప్లేట్ తొలగించడంతో పోలీసులు జరిపిన తనిఖీల్లో పట్టుబడ్డాడు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి న్యాయస్థానంలో డిపాజిట్ చేశారు. ఆ యువకుడు న్యాయస్థానం ప్రక్రియలో భాగంగా పూచీకత్తు, జామీను కోర్టుకు సమర్పించి వాహనం తీసుకున్నాడు. అయినప్పటికీ న్యాయస్థానంలో విచారణ ఎదుర్కొంటున్నాడు. నేరం రుజువైతే నిందితునికి రెండేళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంటుందని పోలీసు అధికారులు చెబుతున్నారు. చైన్ స్నాచింగ్, దోపిడీ, నేరాలు ఎక్కువగా నంబర్ ప్లేట్ లేని వాహనాలు ఉపయోగిస్తూ పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలడంతో వాటిపై ఇటీవల దృష్టి సారించారు. విస్తృతంగా తనిఖీ నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించేవారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు.

ఆరు మాసాల్లో 933 వాహనాలు స్వాధీనం

ఆరు మాసాల వ్యవధిలో 933 వాహనాలకు నంబర్ ప్లేట్లు సక్రమంగా లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో దొరికిన వాటిలో సగానికి పైగా పెట్టీ కేసులు. మోటార్ వాహనాల నిబంధనల కింద జరిమానాలు విధించి నంబర్ ప్లేట్లు అమర్చి (సరిచేసి) వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సంబంధిత వాహనాలను అప్పగిస్తున్నారు. గతంలో నేర చరిత్ర ఉన్నవారిపై 420 కింద కేసు నమోదు చేస్తున్నారు. ఇలా కేసులు నమోదైనవారిలో కొంతమంది యువకులు, విద్యార్థులు ఉన్నారు. వీరు అవగాహనా రాహిత్యంతో భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులుగా ఉండిపోతారు.

నెంబర్ ప్లేట్లు లేని, సక్రమంగా అమర్చుకోని వాహనాలపై నమోదైన కేసులు ఇలా...

సంవత్సరం	నమోదైన కేసులు	జరిమానా
2020	642	రూ.66,100
2021	1051	రూ.1,07,000
2022	1115	రూ.1,13,400
2023	933	రూ.95,200
మొత్తం (జూన్ వరకు)	3741	రూ.3,81,700

నేరాలు ఛేదించేందుకే..



నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతూ నేరాలకు పాల్పడుతున్నారు. ఈ తరహా కేసులు గతంలోనూ, ఇప్పుడూ నమోదవుతున్నాయి. నంబర్ ప్లేటు లేని ద్విచక్ర వాహనాలు జిల్లాలో ఎక్కువగా వినియోగిస్తున్నట్లు గుర్తించి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం. వాహనదారులు నంబర్ ప్లేట్లు నిబంధనల ప్రకారం ఉండేలా చూసుకోవాలి.

– నాగభూషణం, ట్రాఫిక్ డీఎస్పీ

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు ఓల్డ్‌టౌన్ రూరల్స్ ఏఈ మదన్‌మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల కారణం ఓల్డ్ టౌన్, గనిగల్లి, చిన్న మార్కెట్, బండిమెట్ట, దండిగేరి, ఛత్రిబాగ్, అలిషేర్ బాగ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మహిళా సమస్యలపై పోరాడాలి

కర్నూలు(న్యూసిటీ): మహిళా సమస్యలపై పోరాడాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి కొత్తూరు సత్యానారాయణ గుప్త మహిళా నాయకురాళ్లకు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ కార్యాలయంలో మహిళలకు రెండు రోజుల శిక్షణలో భాగంగా మంగళవారం ఆయన మాట్లాడారు. దేశ అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందన్నారు. మహిళల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై పోరు సల్పాలని మహిళా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మిద్దె పైనుంచి పడి గౌండ మృతి

కర్నూలు: స్థానిక బుధవారపేటకు చెందిన షేక్షావలి (36) నిర్మాణ పనుల్లో ఉన్న ఇంటిపై నుంచి ప్రమాదవశాత్తూ కింద పడి మృతిచెందాడు. ప్రకాష్ నగర్‌లో మూడో అంతస్తుపై మంగళవారం కూలీ పనిచేస్తుండగా అదుపు తప్పడంతో కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. చికిత్సల నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య షహానా ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

పథకాలతో ప్రజల ఆర్థికాభివృద్ధి



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య

- వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు రామయ్య, రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని వైఎస్సార్ సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వారు మంగళవారం 19వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల వెంట తిరగాల్సి వచ్చేదన్నారు. తమ ప్రభుత్వంలో ఎవరి సిఫార్స్ లేకుండానే కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాసులు, జయరాముడు, శ్వేతారెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సభ్యుల ప్రకటన వాయిదా

కర్నూలు (టౌన్): నగరపాలక స్టాండింగ్ కమిటీ సభ్యుల అధికారిక ప్రకటన వాయిదా పడింది. గత నెల 28న బరిలో ఉన్న 10 మంది కార్పొరేటర్లలో ఐదుగురు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. అదే రోజు స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు నగరపాలక అధికారులు ప్రకటించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మంగళవారం సాయంత్రం నగరపాలక అధికారులు అధికారికంగా ప్రకటించి ఎన్నికైన వారికి డిక్లరేషన్ పత్రాలు అందజేయాలి. నిబంధనలు పాటించకుండా అధికారులు ఇష్టారాజ్యంగా ఎన్నిక ప్రక్రియ నిర్వహించడవల్లే ఫిర్యాదులు రావడంతో సభ్యుల ప్రకటన కలెక్టర్ వాయిదా వేయాలని సూచించినట్లు సమాచారం. కాగా ఇదే విషయమై మున్సిపల్ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించినా ఏ ఒక్కరూ స్పందించక పోవడం గమనార్హం.

పేదింటి కష్టాలు తొలగించే పథకాలు



చిత్తారి గేరిలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

- ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): పేదింటి కష్టాలు తొలగించేలా రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఉన్నాయని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక 5వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్తారిగేరి వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల ముందు పాదయాత్ర ద్వారా పేదల కష్టాలు తెలుసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వాటిని తొలగించేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వీటిని ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత, పార్టీ నాయకులు శేషయాదవ్, అక్బర్ అలీ, మహబూబ్ బాషా, మక్బూల్, అబ్దుల్లా పాల్గొన్నారు.

మొదటి రోజు 60.95 శాతం పూర్తి



పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ రాజశేఖర్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం 1వ తేదీ పెన్షన్ల పంపిణీ చురుగ్గా సాగింది. ఉదయం 6 గంటల నుంచి 133 సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందజేశారు. నగర పరిధిలో అన్ని 32,282 మంది పెన్షన్ దారులున్నారు. మొదటి రోజు 19,677 మందికి (60.95 శాతం) అందజేశారని నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో 100 శాతం పెన్షన్ పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటించాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఆసుపత్రి సిబ్బంది సూచించారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో కార్యాలయ ఉద్యోగులతో సమావేశమై ప్రతి ఒక్కరూ ఎఫ్ఆర్ఎస్ హాజరు వేయాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పరిష్కరించాల సూచించారు. సమావేశంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆసుపత్రి ఏడీ రమేష్ బాబు పాల్గొన్నారు.

పీజీ విద్యార్థులకు బోధన

తాను ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఉంటూ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో పీజీ విద్యార్థులకు కూడా బోధన చేస్తానని డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. మంగళవారం ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, వివిధ విభాగాల హెచ్ఓడీలు, వైద్యులు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి రూపురేఖలు త్వరలో మారనున్నాయన్నారు.

కలెక్టర్, జేసీని కలిసిన సూపరింటెండెంట్



జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కలిసిన డాక్టర్ వెంకటరంగారెడ్డి

పెద్దాస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

సూపరింటెండెంట్‌కు ఎమ్మెల్యే అభినందనలు

ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జి.సుధాకర్ అభినందనలు తెలిపారు. తలసీమియా బాధితుడిని పరామర్శించేందుకు ఆస్పత్రికి వచ్చిన ఆయన నూతన సూపరింటెండెంట్‌ను కలిసి అభినందనలు తెలిపారు.



మానవహారం నిర్వహిస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు కల్చరల్: తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘాల జేఏసీ చైర్మన్ బీఎస్ గణేష్, కన్వీనర్ ఎస్.లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్యదర్శి బి.రంగస్వామి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన దశల వారీ నిరసనల్లో భాగంగా మంగళవారం విద్యుత్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 2, 3 తేదీల్లో సర్కిల్ కార్యాలయం వద్ద చేపట్టే రిలే నిరాహార దీక్షల్లో ఉద్యోగులు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో 1104 ఉద్యోగుల సంఘం నాయకులు కృష్ణయ్య, 327 ఉద్యోగుల సంఘం నాయకులు రఘువేంద్రప్రసాద్, ఓసీ ఉద్యోగుల సంఘం నాయకులు గిరి, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు రామరాజు, ఇంజినీరింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు విరుపాక్షరెడ్డి, డిప్లొమా ఉద్యోగుల సంఘం నాయకులు టీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జాస్మిత్‌కౌర్

కర్నూలు (న్యూసిటీ): రోప్ స్కిప్పింగ్ పోటీలో పతకాలు సాధించిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపాల్ జాస్మిత్ కౌర్ మంగళవారం అభినందించారు. ఇటీవల గార్గేయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో తమ విద్యార్థులు విద్యార్థులు లాస్యప్రియ, అక్షిత్, సమీక్ష, అనిరుద్ ప్రతిభ కనబరిచి పతకం సాధించడం సంతోషకరమని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆర్‌యూ భూములు ఆక్రమిస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయానికి సంబంధించిన భూములను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని వర్సిటీ రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆక్రమణదారులపై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. యూనివర్సిటీ భూములను సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే ఆ స్థలంలో బోర్డు ఏర్పాటు చేయిస్తామన్నారు.

జిల్లా అధికారులను కలిసిన ఏపీఆర్ఎస్ఏ కమిటీలు



కలెక్టర్ సృజనకు పూల బొకే అందజేస్తున్న రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ కలెక్టరేట్ విభాగం సభ్యులు



కలెక్టర్ సృజనకు పూల బొకే అందజేస్తున్న ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ కర్నూలు డివిజన్ సభ్యులు

కర్నూలు(సెంట్రల్): ఇటీవల ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ)లో పలు విభాగాలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కలెక్టరేట్, కర్నూలు, పత్తికొండ డివిజన్లకు నూతన కమిటీలు ఎన్నికయ్యాయి.ఈ క్రమంలో మంగళవారం నూతన కమిటీలు జిల్లా అధ్యక్షుడు వి.గిరికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్యలను ఆయా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మర్యాదపూర్వకగా కలిశారు. పూలబొకేలను అందజేసి తమ సంఘ సభ్యులకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

రక్షణ కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): ఆస్పరి మండలంలో వలగొండలోని దళితులకు రక్షణ కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టీఎం రమేష్ మాదిగ డిమాండ్ చేశారు. వలగొండ దళితులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన కొందరు.. ఎస్సీలపై దాడికి యత్నించారన్నారు. వారిని గుర్తించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. అనంతర జేసీ నారపురెడ్డి మౌర్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గిడ్డయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

డీఈఈల విధుల్లో స్వల్ప మార్పు

కర్నూలు (టౌన్): నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలోని డీఈఈ విధుల్లో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ స్వల్ప మార్పులు చేసి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 24న రాజ్‌విహార్ సెంటర్ సమీపంలోని మెడికల్ కళాశాల వద్ద చేపడుతున్న ఫౌంటెన్, డ్రెయిన్ వంటి నిర్మాణాలు కూలిపోయాయి. ఈ ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. ఇదే విషయంపై వివిధ పార్టీలకు చెందిన నాయకులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఆ ఏరియాలో పనిచేసే డీఈఈ గోపాల క్రిష్ణయ్యను తప్పించి ఆ స్థానంలో డీఈఈ గిరిరాజ్‌కు అప్పగించారు.